సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రయోజనకర సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
90324 97123
నంబర్‌ను సంప్రదించండి

డిజిటల్ సేవలతో.. సత్వర వైద్యం

- కొబ్బరితోట పీహెచ్‌సీలో ఏర్పాటు
- సులభంగా రిజిస్ట్రేషన్ నుంచి పరీక్షల వరకు
- స్పెషలిస్ట్ వైద్యుల నియామకంతో లబ్ధిదారుల హర్షం

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇక సులభంగా రోగులకు సేవలందనున్నాయి. డిజిటలైజేషన్ వల్ల అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో చూపించుకునే రోగుల వివరాలన్నీ డాటాబేస్‌లో నిక్షిప్తమై ఆ రోగి.. ఎప్పుడు వచ్చినా అతని వివరాలు ఒక్క క్లిక్‌తో వైద్యుల ముందుంటాయి. దాంతో ఆ రోగి మెడికల్ హిస్టరీ ఇట్టే అవగతమై వైద్యులు సులభంగా వైద్యం చేసే వీలు కలుగుతుంది. రాష్ట్రంలో ఈ తరహా వైద్య సేవలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తేవటం వల్ల సత్వం వైద్యసేవలు అందుతున్నాయని అటు వైద్యులు, ఇటు రోగులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కొబ్బరితోట డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్



డిజిటల్ ట్యాబ్‌లో పరీక్ష చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్



ట్యాబ్ ద్వారా రోగిని పరీక్షించి వివరాలు, మందులు నమోదు చేస్తున్న వైద్యాధికారి



లబ్ధిదారుల పేర్లు కంప్యూటర్‌లో రిజిస్టర్ చేస్తున్న డాటా ఎంట్రీ ఆపరేటర్

అల్లిపురం : ఒకప్పటి ప్రభుత్వ ఆస్పత్రులు వేరు.. ఆ ఆస్పత్రుల్లో వైద్యులుండేవారు కాదు. వసతులు శూన్యం. ఫలితంగా ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లాలంటే పేదలు భయపడిపోయేవారు. ఒకవేళ తప్పని పరిస్థితిలో వెళ్లినా.. గంటల కొద్దీ వేచి ఉండాల్సి వచ్చేది. వెళ్లిన దగ్గర నుంచి.. పేరు నమోదు చేసి పరీక్షలు చేసే వరకు వివిధ స్థాయిల్లో అనేక చిట్టీలపై పరీక్షలు, మందులు రాసేవారు. ఒకవేళ ఆ చిట్టీ గనుక పోతే ఇక ఆ రోగి వివరాలు తెలుసుకోవడం కష్టమైపోయేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రజల ఆరోగ్యానికి జగనన్న ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. అత్యాధునిక వసతులతో పీహెచ్‌సీలను ఏర్పాటు చేసింది. ప్రతి 25 వేల మంది జనాభాకు ఒక పీహెచ్‌సీ ఏర్పాటయింది. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్య సిబ్బంది ఉచితంగా సేవలు అందిస్తున్నారు.

డిజిటలైజేషన్‌తో పేపర్ వర్క్‌కు స్వస్తి..

పీహెచ్‌సీలలో ప్రతి ఒక్కటి డిజిటలైజేషన్ చేయటంతో పేపర్‌లెస్ వర్క్ అందుబాటులోకి వచ్చింది. రోగి తన పేరు నమోదు చేసిన దగ్గర నుంచి వారికి జరపాల్సిన పరీక్షలు, మందులు ఆధార్ కార్డును అనుసరించి సమాచారం నిక్షిప్తం చేస్తున్నారు. రోగి ఎప్పుడు వచ్చినా ఆధార్ కార్డు నంబర్ చెబితే అప్పటి వరకు అతనికి గల వ్యాధులు, వాడిన మందుల హిస్టరీ బయటపడుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఏ పీహెచ్‌సీకి వెళ్లినా అతని మెడికల్ హిస్టరీ తెలుసుకోవచ్చు. డిజిటలైజేషన్ ద్వారా వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందనేది వాస్తవం.

పది పడకల ఇన్‌పేషెంట్ విభాగం..

కొబ్బరితోట అర్బన్ హెల్త్ సెంటర్‌లో పది పడకల ఇన్‌పేషెంట్ విభాగం కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. అవసరమైన వారికి అత్యవసరంగా చికిత్స అందజేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. ఆస్పత్రిలో మెడికల్ ఆఫీసర్, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక ఫార్మసిస్టు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక డాటా ఎంట్రీ ఆపరేటర్, 4వ తరగతి ఉద్యోగి ఉండేలా చర్యలు తీసుకున్నారు. స్పెషాలిటీ వైద్య సేవలు అందించేందుకు వీలుగా చెవి, ముక్కు, గొంతు వైద్యులు, చర్మవ్యాధి నిపుణులు, ప్రసూతి వైద్య నిపుణలు, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు, జనరల్ సర్జరీ వైద్య నిపుణులను రోజుకొకరు సేవలందించేలా అందుబాటులోకి తీసుకువచ్చారు.

అందుబాటులోకి 60 రకాల పరీక్షలు..

ప్రస్తుత పరిస్థితుల్లో రక్త పరీక్షలు, షుగర్ పరీక్షలు చేయించుకోవాలంటే వేలకు వేలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పీహెచ్‌సీలు ఆధునికీకరించిన తర్వాత సుమారు 60 రకాల పరీక్షలు నిర్వహించేందుకు ఆధునిక పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో పరీక్షల నిమిత్తం పేదలు ల్యాబ్‌లకు పరిగెత్తాల్సిన అవసరం కూడా లేకుండా చేశారు. పరీక్షలు నిర్వహించి ఆ వివరాలను డిజిటలైజేషన్‌లో భాగంగా లబ్ధిదారుల డాటాబేస్‌లో భద్రపరచటంతో వారి హిస్టరీ ఆ వివరాలన్నీ అందుబాటులో ఉంటాయి. ఇదొక విప్లవాత్మక మార్పుగా భావించవచ్చు.

రోగుల వివరాల సేకరణ సులభం



ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన డిజిటలైజేషన్‌తో రోగుల వివరాల సేకరణ సులభమయింది. ఇక్కడి పీహెచ్‌సీలో మలేరియా, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తాం. అవసరమైన వారిని పీహెచ్‌సీకి తరలించి వైద్యం చేస్తాం. ఎటువంటి సేవలు చేసినా అన్నీ రోగి డాటాబేస్‌లో అందుబాటులో ఉంటాయి.

– నాగమణి, ఆశ వర్కర్, కొబ్బరితోట పీహెచ్‌సీ

రూ.1.17 కోట్లతో కొత్త పీహెచ్‌సీ



34వ వార్డుతో పాటు 33, 32 వార్డులకు గాను కొత్త పీహెచ్‌సీ రూ.1.17 కోట్లతో నిర్మించాం. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆశయాల మేరకు అందరికీ వైద్యం అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పీహెచ్‌సీలో ఆధునిక వసతులు కల్పించి మంచి సేవలు అందిస్తున్నాం. ప్రజలు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

– తోట పద్మావతి, 34వ వార్డు కార్పొరేటర్

క్లుప్తంగా

బహుభాషా గ్రంథావిష్కరణ



డాక్టర్ జయలక్ష్మిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో బహు భాషా గ్రంథావిష్కరణ జరిగింది. శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, హిందీ ఆచార్యులు, ద్వితీయ భాషా విభాగాధ్యక్షులు డాక్టర్ పి.కె. జయలక్ష్మి సంపాదకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. భారతీయ భాషల్లో విద్య, సాంకేతిక పదజాల ప్రాముఖ్యత అనే అంశంపై రచించిన 'సమాగమ్' బహుభాషా గ్రంథాన్ని ఆవిష్కరించిన సుమారు 50 మంది అధ్యాపకులను డాక్టర్ సిస్టర్ షైజీ అభినందించారు. సాహితీ రంగంలో డాక్టర్ పి.కె. జయలక్ష్మి సేవలను రచయితలు, సిస్టర్ షైజీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో రచయితలు ఎస్. దీప్తి, గౌరీనాయుడు, డి. కోటేశ్వరరావు, అనుపమ, మౌసమి, సుజాత, అనిత, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఎండలతో ప్రజల బెంబేలు



నౌరోజీ రోడ్డులో వాహనాలు ఆపి తాటిముంజులు కొనుగోలు చేస్తున్న ప్రయాణికులు

డాబాగార్డెన్స్ : శుక్రవారం భానుడు మరోసారి నిప్పులు చెరిగాడు. బుధవారం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన తర్వాత గురువారం చిరుజల్లుల వల్ల ప్రజలు సేదదీరారు. వాతావరణం చల్లబడి ఉపశమనం పొందారు. ఆరోజు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఒక మోస్తరుగా జల్లులు కురవడంతో ఈ వేసవి సీజన్ అంతా ఉష్ణతాపంతో నానా అగచాట్లు పడ్డవారంతా 'హమ్మయ్య' అనుకున్నారు. శుక్రవారం కూడా వాతావరణం అలాగే ఉంటుందని అంతా భావించారు. ఉదయం ఎనిమిదిన్నర.. తొమ్మిది వరకు చల్లగానే ఉన్నా.. ఆ తర్వాత సూర్యుడు తన ప్రతాపం చూపించాడు. అంతకంతకు తీక్షణత పెరిగి చండ ప్రచండంగా ఎండ విరగ కాసింది. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యమైపోయాయి. తప్పనిసరి పనులపై బయటికి వచ్చిన వారు వేసవి వేడి నుంచి ఉపశమనం కోసం శీతల పానీయాల దుకాణాలను ఆశ్రయించారు. ఇంకొందరు వేసవిలో విరివిగా దొరికే తాటి ముంజులు కొనుగోలు చేసి ఇంటి బాట పట్టారు.

చలివేంద్రం ఏర్పాటు



అక్కయ్యపాలెంలో భారత వికాస్ పరిషత్ ఏర్పాటు చేసిన చలివేంద్రం

సీతంపేట: భారత వికాస్ పరిషత్ విశాఖపట్నం శాఖ, భారత వికాస్ పరిషత్ ఝాన్సీలక్ష్మీ భాయి నారి శాఖ సంయుక్తంగా శుక్రవారం అక్కయ్యపాలెం వాగ్దేవి స్కూల్ వద్ద మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశాయి. ముఖ్య అతిథి పరిషత్ ప్రాంత అధ్యక్షుడు వంకాయల సన్యాసిరావు చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవిలో పాదచారులు, వాహన చోదకుల దాహాన్ని తీర్చడంలో చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంస్థలు తమ వంతు సామాజిక బాధ్యతగా చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చాలని తెలియజేశారు. కార్యక్రమంలో పరిషత్ సంయుక్త సంస్థల కార్యవర్గ సభ్యులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసుల రెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

కల్యాణం.. కమనీయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ ఆస్థాన మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేష వస్త్రాలు అందజేశారు.

ఆదరించి.. ఆశ్రయం కల్పించి..



పూజలు చేస్తున్న ఉత్తర భారతీయులు



దేవాలయంలో సమావేశమైన ఇతర రాష్ట్ర మహిళలు

- ఉత్తర భారతీయులకు కేరాఫ్‌గా దక్షిణ నియోజకవర్గం
- వ్యాపారాలు.. నివాసం.. పిల్లల చదువులు అన్నీ ఇక్కడే
- ఆత్మీయంగా అక్కున చేర్చుకుంటున్న స్థానికులు

డాబాగార్డెన్స్ : విశాఖ సంస్కృతీ సాంప్రదాయాలకు పుట్టినిల్లు. ఏ ప్రాంతం నుంచి వలస వచ్చిన వారినైనా అక్కున చేర్చుకుంటారు ఇక్కడి ప్రజలు. ఏ ప్రాంతం వారైనా ఇక్కడి వాతావరణానికి, సంస్కృతికి అలవాటుపడిపోతారు. బయటి వారు ఎవరైనా ఇక్కడి వారు స్నేహహస్తం చాచి వారిని తమతో కలుపుకుంటారు. ముఖ్యంగా వినాయక చవితి వేడుకలు.. దేవీ నవరాత్రులు.. విశిష్టత గల పండగల్లో స్థానికేతరులను కలుపుకుని ఇక్కడి వారు వేడుకలు నిర్వహిస్తుంటారు. హోలీ పండగతో పాటు దేశవ్యాప్తంగా నిర్వహించుకునే దీపావళి, సంక్రాంతి, శివరాత్రి వంటి పండగలను అంతా కలిసి నిర్వహించుకుంటారు. రిపబ్లిక్ డే, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కూడా అంతా ఒక్కటై కనిపిస్తారు.

'దక్షిణ'లో వివిధ మతాలు..కులాలు..

ఇక విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గంలో స్థానికంగా ఉన్న వారితో పాటు విజయనగరం, పార్వతీపురం (మన్యం జిల్లా) శ్రీకాకుళం, పాడేరు, అనకాపల్లి జిల్లా, తూర్పు, పశ్చిమ జిల్లాలు, కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచే కాక రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, తెలంగాణ, ఒడిశా, కోల్‌కతా, నాగాలాండ్, మణిపురి, అస్సాం, బీహార్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్‌తో పాటు ఎంతో మంది దక్షిణ భారతీయులు విశాఖకు వలస వచ్చి వ్యాపారాలు సాగిస్తూ స్థానికంగా స్థిరపడుతున్నారు. వారి పిల్లల చదువులు కూడా ఇక్కడే సాగుతున్నాయి. ఇక్కడి వారితో మమేకమవుతూ సేవా మార్గాల్లో నడుస్తున్నారు. నమ్మే ఇష్టదైవాల ఆలయాలు కూడా స్థానికంగా నిర్మించుకుంటున్నారు. ప్రతి ఏటా వారి పండగలు ఘనంగా జరుపుకుంటున్నారు.

ఆహారపు అలవాట్లు కూడా ఇష్టపడుతున్నారు..

ఇదిలా ఉండగా ఇక్కడి ఆహారానికి బయటి నుంచి వచ్చిన వారు అలవాటు పడుతున్నారు. అలాగే పానిపూరీ, భేల్‌పూరి, పావ్‌బాజీ వంటి ఇతర రాష్ట్రాల ఆహారానికి ఇక్కడి వారు కూడా అలవాటు పడటం విశేషం. ఈ విధంగా భిన్నత్వంలో ఏకత్వం అనే పురాతన నానుడి విశాఖ దక్షిణలో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

భక్తుల కొంగు బంగారం ఎర్నిమాంబ

- కోరిన వరాలిచ్చే కల్పవల్లి
- నేడు అమ్మవారి తొలేళ్ల సంబరం
- ఆదివారం ప్రధాన జాతర



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు



జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ ఆలయ గోపురం

కంచరపాలెం : సంతానం లేని దంపతులకు సంతాన లక్ష్మిగా, కోరిన వరాలిచ్చే కల్పవల్లిగా జ్ఞానాపురం ఎర్నిమాంబ అమ్మవారు కీర్తి గడించారు. గత వందేళ్లుగా అమ్మవారి చల్లని చూపు కోసం వేలాది మంది భక్తులు తరలి వస్తున్నారు. జ్ఞానాపురం, అల్లిపురం, అచ్చియ్యమ్మపేట ప్రజల ఇలవేల్పుగా ఎర్నిమాంబ కొలువై ఉన్నారు. భక్తిశ్రద్ధలతో కొలిస్తే తమ కోరికలు నెరవేరుతాయనే నమ్మకం భక్తుల్లో ఉంది. 18 శనివారం ఎర్నిమాంబ అమ్మవారి తొలేళ్ల సంబరం. 19 ఆదివారం వైభవంగా ప్రధాన జాతర, 25 శనివారం భారీ అన్నసమారాధన, 26న మారువారం నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

అమ్మవారి ఆలయ చరిత్ర..

ఎనభై ఏళ్ల క్రితం విశాఖ కుగ్రామంగా ఉన్న నేపథ్యంలో అప్పటి భక్తులు అమ్మవారికి చిన్నగుడి నిర్మించారు. ఈ ప్రాంతంలో తుప్పలు, డొంకల మధ్య అమ్మవారు వెలసినట్టు భక్తులు చెబుతారు. పదుల సంఖ్యలోనే ఇళ్లు ఉండడంతో చీకటి పడితే జనసంచారం ఉండేది కాదు. రాత్రి వేళ ఈ మార్గంలో వెళ్లేందుకు అంతా భయపడేవారు. తర్వాత ఇక్కడ ప్రజలు నివసించటం మొదలు పెట్టడంతో ఊరు అభివృద్ధి చెందింది. ఆలయం పక్కగా జీవీఎంసీ అధికారులు రోడ్లు విస్తరించారు. గత ఇరవై ఐదేళ్లుగా అమ్మవారిని భక్తులు విశేషంగా పూజిస్తున్నారు. ఎర్నిమాంబ అమ్మవారికి తొమ్మిది మంది అక్కచెల్లెళ్లు ఉన్నట్లు పూర్వీకులు చెబుతారు. ప్రతి ఏటా మే నెల మూడో ఆదివారం నిర్వహించే ప్రధాన పండగను అద్వితీయంగా నిర్వహించడం ఆనవాయితీగా మారింది. ఆది, మంగళ, బుధ, శుక్రవారాల్లో దేవాలయం భక్తులతో కిటకిటలాడుతుంది. విశాఖ జిల్లాతో పాటు శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి, తూర్పుగోదావరి తదితర జిల్లాల నుంచి కూడా భక్తులు అమ్మవారి సందర్శనార్థం వస్తుంటారు. ఆదివారం ఆలయం వద్దే వంటా వార్పు చేసుకుని అమ్మవారి చెంతనే ప్రసాదాలు స్వీకరిస్తారు. 2007లో సంఘం సభ్యులే దేవాలయాన్ని ఎండోమెంటుకు అప్పగించారు.

మా ఇంటి ఇలవేల్పు



ఎర్నిమాంబను మా ఇంటి ఇలవేల్పుగా కొలుస్తున్నాం. అమ్మవార్ని దర్శించుకున్న తర్వాతే ఏ పనైనా చేస్తాం. భక్తిశ్రద్ధలతో పూజిస్తే అమ్మ కోరిన కోర్కెలు తప్పక తీరుస్తుంది. అమ్మవారి జాతరలో కుటుంబమంతా మొక్కులు చెల్లించుకుంటాం.

– బంటుపల్లి నూకరాజు, గురుస్వామి, పూర్ణామార్కెట్,

అమ్మ దీవెనలతో అంతా మంచే



మా తాతల కాలం నుంచి మా కుటుంబంలో అందరి పేర్లు ఎర్నిమాంబ పేరుతో కలిసే ఉంటాయి. అమ్మవారిని సంతాన లక్ష్మిగా కొలుస్తున్నాం. అమ్మ దీవెనలు ఉంటే చల్లగా ఉంటాం. అమ్మ దర్శన భాగ్యం, నిత్య పూజలతో ఎవరికైనా మంచి జరుగుతుంది. నమ్ముకున్న వాళ్లకు కొంగు బంగారంగా అమ్మ కటాక్షిస్తుంది.

– పల్లా పద్మజ, భక్తురాలు, కంచరపాలెం

మౌలిక సదుపాయాలు కల్పించాం

ఎర్నిమాంబ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలకు ఆలయ చైర్మన్ ఎల్. రమణ, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. శనివారం జరిగే తొలేళ్ల సంబరాలు పూర్ణామార్కెట్ దుర్గమాంబ ఆలయం నుంచి ప్రారంభం అవుతాయి. ఆదివారం జరిగే ప్రధాన జాతరకు ఆలయ పరిసరాల్లో భక్తులకు మౌలిక వసతులు కల్పించాం.

– డీవీఎస్ సురేష్‌బాబా, ఈవో, ఎర్నిమాంబ ఆలయం

చక్కటి జీవనశైలితో అదుపులో రక్తపోటు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : ప్రపంచ హైపర్ టెన్షన్ డే సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. రేసవానిపాలెం డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి మొదలైన ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. రేసవానిపాలెం నుంచి సత్యం జంక్షన్ మీదుగా ర్యాలీ కొనసాగి తిరిగి డీఎంహెచ్‌వో కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో నెల రోజుల వరకు ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఉచిత రక్తపోటు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. 30 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధిక రక్తపోటుతో కలిగే ప్రమాదాల గురించి అవగాహన కల్పించాల్సి అవసరం ఉందన్నారు. గుండె జబ్బులు, పక్షవాతం, మూత్రపిండ సమస్యలు, అకాల మరణాలకు హైపర్ టెన్షన్ ప్రథమ కారణమన్నారు. చాలా మందికి అధిక రక్తపోటు లక్షణాలు లేకపోయినా, చికిత్స చేయకుండా వదిలేస్తే అది తీవ్రమైన సమస్యలకు దారి తీస్తుందన్నారు. క్రమం తప్పకుండా తనిఖీ చేయడం, మందులు తీసుకోవడం ద్వారా రక్తపోటును నివారించవచ్చన్నారు. ప్రపంచవ్యాప్తంగా అధిక రక్తపోటు వల్ల ఎంతో మంది మరణిస్తున్నారని అన్నారు. ఆర్‌బీఎస్‌కే సమన్వయకర్త డాక్టర్ సమత మాట్లాడుతూ ప్రపంచ రక్తపోటు దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. అధిక రక్తపోటు తీవ్రమైన సమస్యలకు దారి తీస్తుందన్నారు. ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా కొంత వరకు మరణాలను నియంత్రించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, జిల్లా మీడియా విస్తరణ అధికారి(డెమో) బి.నాగేశ్వరరావు, డాక్టర్ జగదీష్‌ప్రసాద్, టీబీ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE
BAJAJ MAXIMA DIESEL BS VI
2023 MODEL AP39 VA 7752
Cell : 99594 44203
43-9-226, Sri Priya Complex,
Railway New Colony, VIZAG.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30కు బాలభోగం, 9.30కు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, మధ్యాహ్నం అన్న సమారాధన చేస్తారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ సౌత్
7997958342, 9912440606

ఏయూను సందర్శించిన అమెరికా ఆచార్యుడు



వీసీ ప్రసాదరెడ్డితో భేటీ అయిన అమెరికా ఆచార్యుడు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని అమెరికాలోని ఇండియానా యూనివర్సిటీ ఇండియానా పోలీస్‌కు చెందిన డాక్టర్ మంగిలాల్ అగర్వాల్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌లతో సమావేశమయ్యారు. బోధన, పరిశోధన భాగస్వామ్యం, సంయుక్తంగా కోర్సుల నిర్వహణ, అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలనే భావించే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టరల్ ప్రోగ్రాం, ఆన్‌లైన్ కోర్సులను ఏయూ సిబ్‌తో పాటు ఇతర విభాగాలతో సంయుక్తంగా నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ఆచార్యులు ఆచార్య జి.గిరిజా శంకర్, ఆచార్య కె.ఈశ్వర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ సౌత్
9010810033, 9010196663
Office mail : sakshiadvtvsp@gmail.com